

## నీయోలింక్ కంపెనీలో
# పలువురికి అస్వస్థత

రేణిగుంట, మార్చి 29 ప్రభాతవార్త:

రేణిగుంట ఐటీ హబ్‌లోని కార్బన్ అనుబంధ నియోలింక్ కంపెనీలో బుధవారం పలువురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థత గురైన వారంతా మహిళలు కావడం విశేషం. కంపెనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ఏసీలు పని చేయకపోవడం వల్ల ఆ ప్రాంతంలో ఊపిరి ఆడడం కష్టంగా మారిందని కంపెనీ ప్రతినిధులు అంటున్నారు. ఈ క్రమంలో 11 మంది అస్వస్థతకు గురయ్యారు. తక్షణం స్పందించిన కంపెనీ ప్రతినిధులు వీరిని సమీపంలోని శ్రీ బాలాజీ మెడికల్ కాలేజీ ఆస్పత్రి రీసెర్చ్ సెంటర్‌కు హుటాముటిన తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు డైరెక్టర్ హెచ్ఆర్ డా. నాగరాజు, జేఈవో డా. ఎన్.నవీన్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో వైద్య సేవలు అందించారు. దీంతో పది మంది కోలుకున్నారు. కేవీబీ పురంకు చెందిన మహిళకు వైద్యులు ఐసీయూలో అత్యవసర చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది.



తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



# మహిళా పక్షపాతి జగన్

## డిప్యూటీ సీఎం నారాయణస్వామి



సదస్సును ప్రారంభిస్తున్న మంత్రులు నారాయణస్వామి,ఆర్‌కె.రోజాలు

తిరుచానూరు,మార్చి 29 ప్రభాతవార్త:

మహిళలు స్వయం శక్తివంతులగా ఎదగాలని కోరుతూ దానికి తగ్గట్లుగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నారని డిప్యూటీ సిఎం నారాయణస్వామి, పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కె.రోజా కొనియాడారు.బుధవారం స్థానిక తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన సరస్-అఖిల భారత డ్వాక్రా బజార్ 2023 కార్యక్రమాన్ని మంత్రులు,ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి,ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి,కలెక్టర్ వెంకట రమణారెడ్డిలు కలిసి అట్టహాసంగా ప్రారంభించారు.ఈ డ్వాక్రా బజార్ ఈనెల 29 నుండి ఏప్రిల్ 9 వరకు నిర్వహిస్తున్న దాదాపు 250 మంది ఎస్‌హెచ్‌జి గ్రూపుల మహిళలు రైతు ఉత్పాదక గ్రూపులను తయారు చేసిన వివిధ ఉత్పత్తుల ప్రదర్శన,అమ్మకాలు ఉంటాయని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళల అభివృద్ధి కోసం తిరుపతిలో నిర్వహించడం గర్వకారణమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పద్మావతిపురం సర్పంచ్ జ్యోతి,ఎంపిటిసి భార్గవి,మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీవిద్య,పథక సంచాలకులు ఆర్‌డిఎ.జ్యోతి,మెప్మా పిడి రాధమ్మ, ఎల్‌డిఎం.సుభాష్, డిడిఎం నాబార్డు సునీల్,జిల్లా పర్యాటక శాఖాధికారి రూపేంద్రనాధరెడ్డి,డిఆర్‌డిఎ అధనపు పిడి ప్రభావతి,శిల్పారామం ఏఓ ఖాదర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్షల పక్కా నిర్వహణపై

# మల్లగుల్లాలు

## గత ఏడాది సంఘటన పునరావృతంకాకుండా పకడ్బందీ చర్యలు

చిత్తూరు, మార్చి 29 ప్రభాతవార్త:

జిల్లాలో ఏప్రిల్ 3వ తేదీ నుండి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలను పక్కాగా నిర్వహించి పూర్తి చేయడానికి జిల్లా అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతుంది. జిల్లాలో గత ఏడాది టెన్త్ పరీక్షల నిర్వహణ సమయంలో జరిగిన సంఘటన జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా విద్యాశాఖ, పోలీసు శాఖ అధికారుల కళ్ళెదుట కన్పిస్తోంది. గత ఏడాది టెన్త్ పరీక్ష ప్రశ్నాపత్రం జిల్లా నుండి లీకై రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించడం, ఈ ఘటనపై విచారించడానికి రంగంలోకి దిగిన పోలీసులు టెన్త్ పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను బాధ్యులుగా గుర్తించి వారిపై సస్పెన్షన్ వేటు వేయడం, పోలీసులు కేసు నమోదు చేయడం తెలిసిందే. ఆపై పోలీసులు చేపట్టిన విచారణలో ఈ వ్యవహారంలో కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల ప్రమేయం వున్నట్లు తేలడంతో బాధ్యులైన వారిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. గత ఏడాది టెన్త్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై నమోదైన కేసు విచారణ ఇప్పటికీ సాగుతుంది. ఈ క్రమంలో మళ్ళీ టెన్త్ పరీక్షలు రావడంతో జిల్లాలో గత ఏడాది జరిగిన పొరబాట్లు మళ్ళీ ఎట్టి పరిస్థితుల్లో జరుగకుండా పక్కాగా పరీక్షలు నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేపట్టింది. ఇప్పటికే కలెక్టర్ టెన్త్ పరీక్షల పక్కా నిర్వహణ కోసం జిల్లా స్థాయి అధికారుల సమావేశం నిర్వహించి పరీక్షల నిర్వహణకు సంబంధి దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో టెక్నాలజీ ప్రజలు, విద్యార్థులకు మరింత చేరువ కావడంతో ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యే అవకాశం వుండటంతో ఈ సారి టెన్త్ పరీక్షల విధులకు హాజరయ్యే ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, సూపరిటెండెంట్లు ఎవ్వరి వద్ద సెల్‌ఫోన్లు లేకుండా చూడాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. అలాగే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి తీసుకొని రాకూడదని అధికారులు స్పష్టం చేశారు. అలాగే పోలీసుశాఖ పరీక్షా కేంద్రాల ఆవరణలో 144 సెక్షన్ పక్కాగా అమలు చేయడంతో పాటు పరీక్షా కేంద్రం పరిసరాల్లో వున్న జెరాక్స్ కేంద్రాలను పరీక్షలు ప్రారంభం కావడానికి రెండు గంటల ముందు మూసి వేయాలని పక్కాగా ఆదేశాలు జారీ చేసింది.

**ఏడు పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాల నిఘాలో పరీక్షలు**

జిల్లా అధికార యంత్రాంగం ఏడు పరీక్షా కేంద్రాల్లో టెన్త్ పరీక్షలను సిసి కెమెరాల నిఘాతో విద్యార్థులతో టెన్త్ పరీక్షలు రాయించాలని నిర్ణయించింది. గత ఏడాది టెన్త్ పరీక్షల్లో ప్రశ్నాపత్రం మాల్‌ప్రాక్టీస్‌కు గురైన జిడినెల్లూరు మండలం నెల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సిసి కెమెరాల నిఘాతో పరీక్షలు రాయాల్సి వుంటుంది. అలాగే చిత్తూరు రూరల్ మండలం సిద్ధంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, తుమ్మింద జడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం, రాళ్ళబూదుగురు, వెదురుకుప్పం, ఏకాంబరకుప్పం (నగరి), శంకరాయలపేట(పెద్దపంజాణి) పరీక్షా కేంద్రాల్లో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సిసి కెమెరాల నిఘాలో పరీక్షలు రాయాల్సి వుంటుంది. అలాగే ఇతర పరీక్షా కేంద్రాల్లో పరీక్షల నిర్వహణలో ఎలాంటి అక్రమాలు జరుగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

# కట్టుదిట్టంగా టెన్త్ పరీక్షల నిర్వహణ

**ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో విధులు**

**వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ**

చిత్తూరు, మార్చి 29 ప్రభాతవార్త:

ఏప్రిల్ 3 నుండి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో కట్టుదిట్టంగా నిర్వహించడానికి పక్కా ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. టెన్త్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ టెన్త్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా కలెక్టర్లు, ఎస్పీలు, ఆర్డీఓలు, విద్యాశాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. టెన్త్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని పరీక్షల నిర్వహణకు



సంబంధించి ప్రైవేటు విద్యాసంస్థల సిబ్బందిని ఎట్టి పరిస్థితుల్లోను తీసుకోరాదని, ప్రభుత్వ సిబ్బంది వుండేలా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, సురేష్‌కుమార్‌లు పాల్గొనగా కలెక్టరేట్ నుండి డిఆర్‌ఓ రాజశేఖర్, డిఇఓ విజయేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# చిందేపల్లిలో రెచ్చిపోయిన పోలీసులు

**ఆలయంలో దాక్కున్న వినూత:ఇనుపరాడ్లతో తలుపులు పగుల గొట్టిన పోలీసులు**
**-తిరగబడ్డ జనం: పోలీసులకు గాయాలు**

శ్రీకాళహస్తి రూరల్,మార్చి 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం వద్ద ఇసిఎల్ కంపెనీ ఏర్పేడు మండలం చిందేపల్లి గ్రామానికి వెళ్ళ దారికడ్డంగా గోడ నిర్మించటంతో ఆందోళనలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినూతకోట ఆమె భర్త చంద్రబాబు అమరణ నిరాహారదీక్షలు చేపట్టారు. మూడవ రోజు అమరణనిరాహార దీక్షలు చేస్తున్న వినూత ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. షుగర్ లెవల్స్ 50కి పడిపోయాయి.దాంతో బుధవారం మధ్యాహ్నం నుంచి గ్రామంలో సీన్‌మారిపోయింది. శ్రీకాళహస్తి చుట్టుపక్కల నుంచే కాకుండా బయటి పోలీసులను కూడా అధికారులు మోహరింపజేసారు. ఒక్కసారిగా పోలీసు బలగాలు గ్రామంలోనికి ప్రవేశించిన వెంటనే గ్రామస్థులు ఒక్కటయ్యారు.అయితే పోలీసుల చర్యలను పసిగట్టిన వినూత కోట శిబిరం నుంచి ఆలయ గర్భగుడిలోకి వెళ్లితలుపులు బిగించుకున్నారు. పోలీసులు ఆమెను బయటకు తీసుకురావటానికి తమ ప్రయత్నాలన్ని చేసారు. చివరకు ఇనుపరాడ్లతో ఆలయం తలుపులు పగుల గొట్టి వినూతను ఆదుపులో తీసుకున్నారు.అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

**గ్రామస్థులు పోలీసుల మధ్య దాడులు: పోలీసులకు గాయాలు:**

దీక్షను భంగం చేయటానికి పోలీసులు పూనుకున్నారు.దాంతో గ్రామస్థులు తిరగబడ్డారు. పోలీసులు లాఠీచార్జి చేయటంతో గ్రామస్థులు రాళ్ళతో దాడికి ఉద్యుక్తులయ్యారు. దాంతో ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. లాఠీల దెబ్బలతో గ్రామస్తులు భయభ్రాంతులయ్యారు.అయితే తమ గ్రామానికి సంబంధించిన రోడ్డు కోసం ఆందోళన చేస్తుంటే పోలీసులు రాక్షసుల్లా ఒక్క సారిగా గ్రామం మీద విరచుకుపడ్డారని గ్రామస్థులు ధ్వజమెత్తారు. రెండు గంటల పాటు గ్రామం యుద్ద రంగంగా మారింది. అయితే గ్రామస్థులు కూడా తగ్గేదేలే అంటూ తిరుగబడ్డారు. ఇరువర్గాలు లాఠీలు,రాళ్ళతో దాడులు చేసుకున్నారు. గాయపడిన పోలీసుల్లో బుచ్చినాయుడు కండ్రిగ సిఐ ఆరోహణ రావు,ఎఎస్ఐ శివకుమార్‌లు గాయపడ్డారు. వారిని ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స జరిపారు.



ఆలయంలో ఉన్న వినుతను తీసుకెళ్తున్న పోలీసులు



పోలీసులు,గ్రామస్థుల పరస్పర దాడులు

ఆసుపత్రిలో దీక్ష విరమణ:

చిందేపల్లి గ్రామస్తుల రోడ్డుకోసం అమరణ దీక్ష చేపట్టిన వినూత కోటకు ఆసుపత్రికి తరలించారు. తిరుపతికి తరలించిన ఆమెను జనసేన రాష్ట్ర పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ వినూతకు నిమ్మరసం అందించి దీక్షను విరమింపజేసి వైద్యానికి సహాకరించాలని సూచించారు.

## బాల్య వివాహాలు చేసినా...
# ప్రోత్సహించినా చట్టరీత్యా నేరం

## - కలెక్టర్ వెంకట రమణారెడ్డి



తిరుపతిరూరల్, మార్చి29 ప్రభాతవార్త:

బాల్య వివాహాలు జరిపిన, ప్రోత్సహించిన చట్టరీత్యా నేరమని కలెక్టర్ వెంకట రమణారెడ్డి అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు 6 నుండి 19 సంవత్సరాల బాలబాలికలలో రక్త హీనత, పుట్టిన పిల్లల నుండి 5సంవత్సరాల పిల్లలలో పోషకాహార లోపంతో ఎదుగుదల లోపంతో బాధపడుతున్న వారి వివరాలు మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖల వద్ద ఒకే రకమైన సమాచారం అందుబాటులో ఉండేలా వెల్ఫేర్ అసిస్టెంట్ సంబంధిత ఏ ఎన్ ఎం, అంగన్‌వాడీ కార్యకర్త సయుక్తంగా సందర్శన చేసి, డేటాను సచివాలయంలో అప్డేట్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరములో సామాజిక, ప్రవర్తన మార్పు కమ్యూనికేషన్ (సోషల్ డి హేవియర్ చెంజ్ కమ్యూనికేషన్ ఎస్‌బిసిసి) కమిటీ తొలి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన డిఇఓ, డిఎంహెచ్‌ఓ మహిళా శిశు సంక్షేమశాఖ, డిఆర్‌డిఎ, మెప్మా, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు తదితరులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ కమిటీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యూనిసెఫ్ మార్గదర్శకాల మేరకు సమాజంలో పలు అంశాల్లో ఉత్తమ మార్పు కొరకు సమాచార వ్యాప్తి, ప్రేరణ, సమస్య పరిష్కారం, ప్రణాళికల ఏర్పాటుతో వ్యక్తులు, సంస్థలు, సంఘాలు, సమాజాలతో పరస్పరం కమ్యూనికేషన్ చేసే ప్రక్రియ అన్నారు. ఇందు కొరకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు 6 నుండి 19 సంవత్సరాలు బాలబాలికలలో రక్త హీనత, పుట్టిన పిల్లల నుండి 5సంవత్సరాలు పిల్లలలో పోషక ఆహార లోపం, ఎదుగుదల లోపంతో బాధపడుతున్న వారి వివరాలు తీవ్ర, మధ్యస్త రక్త హీనతతో బాధపడుతున్నవారి వివరాలు, మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్యఆరోగ్య శాఖ ఒకే రకంగా ఉండాలన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ నవజాతి శిశువుల జనన ధ్రువీకరన పత్రాలను సంబందిత అథారిటీ వద్ద నమోదు జరిగేలా రోజువారి పురోగతి సమీక్షించాలని ఆదేశించారు.. సోషల్ బి హేవియరల్ చేంజ్ కమ్యూనికేషన్ (ఎస్‌బిసిసి) కమిటీ రాబోయే మూడు నెలల కాలానికి ఏప్రిల్ మే మాసాలలో గర్భిణీ స్త్రీలలో 10-19 బాల బాలికలలో రక్తహీనత, బాల్యవివాహాలు వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమీక్షలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, సిపిఓ అశోక్‌కుమార్, డిసిహెచ్‌ఎస్ ప్రభావతి, డిఇఓ శేఖర్, జిల్లా సాంఘీక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, పథక సంచాలకులు డిఆర్డీఏ జ్యోతి, మెప్మా రాధమ్మ, జిల్లా గ్రామ సచివాలయ ఇన్‌చార్జి సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

## -మాజీ మంత్రి ఆధ్వర్యంలో ఘనంగా సీనియర్ నాయకులకు సన్మానం



పలమనేరు,మార్చి 29,ప్రభాతవార్త:

పలమనేరు టిడిపి కార్యాలయంలో బుధవారం ఘనంగా తెలుగు దేశం పార్టీ 41 ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.ఈ మేరకు మాజీ మంత్రి అమరనాథరెడ్డి కార్యాలయంలో టిడిపి జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా పార్టీ సాధించిన విజయాలు ఎదుర్కొన్న సమస్యలను పార్టీ నాయకులు గుర్తుపెటుకోవాలని తెలిపారు.తెలుగు వారి ఆత్మగౌరవం కోసం నాడు ఎన్టీఆర్ పార్టీని స్థాపించారని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం నియోజకవర్గంలోని పార్టీ సీనియర్ నాయకులను పూలమాలలతో ఘనంగా సత్కరించారు.పట్టణంలోని అన్నా క్యాంటీన్ వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

# రాజ్యాంగేతర శక్తిని కాను, క్యాబినెట్ హోదాకల్గిన వ్యక్తిని

## -వైసిపి జిల్లా అద్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

వెంకటగిరి, మార్చి29 ప్రభాతవార్త:



తాను రాజ్యంగేతర శక్తిని కాదని క్యాబినెట్ హోదకల్గిన వ్యక్తినని రాష్ట్ర కమ్యునిటిబోర్డు డవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్,వైసిపి జిల్లా అద్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన వెంకటగిరి లోని ఆయన నివాస గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి తనను రాజ్యంగేతర శక్తి అని విమర్శిస్తున్నారని, తాను క్యాబినెట్ హోద కల్గిన వ్యక్తినని తెలిపారు. ఆనం వెళితే తనను తీసుకొని వచ్చిపెట్టారని, నెల్లూరు రూరల్లో శ్రీదర్‌రెడ్డి వెళితే ఎంపి ఆదాల ప్రబాకర్‌రెడ్డిని తీసుకొని వచ్చిపెట్టినట్లు తెలిపారు.సిఎం జగన్ మోహన్ రెడ్డి పరిపాలన రామరాజ్యం వలే ఉందన్నారు. నియోజవర్గ అభివృద్ధికి తాను ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.అభివృద్ధి పనులపై గూడూరు ఆర్‌డిఓ కిరణ్‌కుమార్,తాసిల్దార్ పద్మావతి,ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ,కౌన్సిలర్స్‌తో చర్చించారు.

# పోలీసులకు వెన్నుదన్నుగా హోమ్‌గార్డులు

## హోమ్‌గార్డ్ కర్నూలు రేంజ్ కమాండెంట్ మహేష్‌కుమార్



చిత్తూరు, మార్చి 29 ప్రభాతవార్త:

విధి నిర్వహణలో పోలీసులకు హోమ్‌గార్డులు వెన్నుదన్నుగా నిలవాలని కర్నూలు రేంజ్ హోమ్‌గార్డ్ కమాండెంట్ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. హోమ్‌గార్డ్ యూనిట్ తనిఖీలో భాగంగా బుధవారం కమాండెంట్ మహేష్‌కుమార్ హోమ్‌గార్డుల కవాతును పర్యవేక్షించి వారితో గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో శాంతిభద్రతల కోసం 661 హోమ్‌గార్డులు విధులు నిర్వహిస్తున్నారని, వీరితో పాటు మరో 227 మంది హోమ్‌గార్డులు వివిధ విభాగాల్లో డిప్యూటేషన్లపై విధులు నిర్వహిస్తున్నారన్నారు. హోమ్‌గార్డులో పోలీసులతో సమానంగా ట్రాఫిక్ రెగ్యులేషన్, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల అడ్డుకట్టకు పోలీసులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. హోమ్‌గార్డులు తమ సేవలను చిత్తశుద్ధితో నిర్వర్తించి పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీలు మురళీధర్, కృష్ణమోహన్‌లు, తిరుపతి హోమ్‌గార్డు డిఎస్పీ డి.లక్ష్మణ్‌కుమార్, అడ్మిన్ ఆర్ఐ నీలకంఠేశ్వరరెడ్డి, తదితరులు హాజరయ్యారు.

## వీరభద్ర స్వామి ఆలయ బాలాలయ స్థాపన

శ్రీకాళహస్తి,మార్చి 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా బిక్షాల గాలిగోపురం సమీపంలో వెలసిన వీరభద్రస్వామి ఆలయ జీర్ణోద్ధారణ పనులకు బుధవారం బాలాలయ స్థాపన కార్యక్రమాలు నిర్వహించారు.పురాణ ప్రసిద్ది చెందిన వీర భద్ర స్వామి ఆలయానికి చక్కటి ఆలయం నిర్మించాలని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు నిర్ణయించారు.ఈ మేరకు ఆలయాన్ని పరిశీలించిన ఆయన ఆలయ చరిత్ర తెలుసుకొని ఈ ఆలయాన్ని భక్తులకు అందుబాటులో తీసుకురావటానికి ఇంజనీరింగ్ విభాగం వద్ద అంచనాలు తయారు చేసారు. ఈ పనులు ప్రారంభించుటకు బాలాలయ స్థాపన చేసారు. ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాగభూషణం, సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే విజయం సాధ్యం..ఎంఎల్సి సిపాయి

తొట్టంబేడు, మార్చి 29 ప్రభాతవార్త



లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే విజయం సాధ్యమని విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా ముందుకెళ్లాలని విద్యతోనే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని ఎంఎల్సి డాక్టర్ సిపాయిసుబ్ర మణ్యం తెలిపారు. బుధవారం మండలంలోని చిట్టత్తూరు ఉన్నత పాఠశాలలో సిపాయి విద్యాదీవెన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన ముందుగా చదువుల తల్లి సరస్వతీదేవికి నమస్కరించి పరీక్షలకు సిద్దమవుతున్న పదోతరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందించారు.కార్యక్రమంలోసర్పంచ్ కృష్ణ మూర్తి, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ నాయుడు, ఉపాధ్యాయులు నరేంద్రరెడ్డి, ఎంపిటిసి శైలజ నర సింహులు, వైకాపా నాయకులు అల్లెయ్య, సచివాలయ కన్వీనర్ సురేష్, వైకాపా నాయకులు కృష్ణారెడ్డి, తిరుమలరెడ్డి, రమణారావు, డాక్టర్ బాబురావు, చంద్రారెడ్డి, దీపక్‌రెడ్డి, మునిశేఖర్, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పదోతరగతి పరీక్షలకు సర్వం సిద్దం..డివైఇఓ

–వచ్చేనెల 3 నుంచి పరీక్షలు –డివిజన్‌లో 39 పరీక్షా కేంద్రాలు, 7108 విద్యార్థులు

తొట్టంబేడు, మార్చి 29 ప్రభాతవార్త

వచ్చే నెల పదోతరగతి నుంచి ప్రారంభంకానున్న పదోతరగతి పరీక్షలకు అన్ని సౌకర్యాలు సిద్దం చేశామని పుత్తూరు డివైఇఓ పి.రఘురామయ్య అన్నారు. ఈసందర్భంగా బుధవారం ఆయన డిఈవో డాక్టర్ వి.శేఖర్ ఆదేశాల మేరకు పట్టణంలోని పదోతరగతి కేంద్రాలను పరిశీలించి ఆయన పాఠశాలలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ప్రతి పాఠశాలలో పదోతరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించి ఎంఈవో భువనేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పలుసూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో 39 పరీక్షా కేంద్రాలు, 17 జోన్‌లు ఉన్నాయని 142 పాఠశాలల నుంచి 7108 విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. 39 పరీక్షా కేంద్రాల్లో ఎ సెంటర్లు 20, బి సెంటర్లు 14, సి సెంటర్లు 6 ఉన్నాయని తెలిపారు. నాడు నేడు పనుల్లో భాగంగా పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని ఏలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

## మండలంలో ఘనంగా తెదేపా ఆవిర్భావ వేడుకలు

తొట్టంబేడు, మార్చి 29 ప్రభాతవార్త



మండలంలోని ఇలగనూరు పంచాయతీలో దివంగతనేత గురవయ్యానాయుడు రైస్‌మిల్లు వద్ద తెలుగుదేశంపార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడుల ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా దివంగతనేత బొజ్జలగోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జలబృందమ్మ ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఈసందర్భంగా పార్టీవ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీరామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌కట్‌చేసి తెదేపా నాయకులకు, మహిళలకు పంచిపెట్టారు. ఈసందర్భంగా తెదేపా సీనియర్ నాయకులను, మహిళలను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో పాలసరఫరా మాజీ చైర్మన్ రావిళ్ళమునిరాజనాయుడు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు, భాస్కర్, మెరిమివెంకటసుబ్బయ్య, రాజా, పాల్గుణ, పెంచలయ్య, కమలాకర్, రమాదేవి, హైమావతి, రమణమ్మ, కరీముల్లా, వెంకటరమణ, సుబ్రమణ్యం, విజయనాయుడు, గుర్రప్ప, సునీల్, మురళీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మునిరత్నం, కంచనపల్లి మోహన్, రాజేంద్ర, తొట్టంబేడు బాలసుబ్రమణ్యం, భాస్కర్, సింగమాలగురవయ్య, కుప్పయ్య, శంకర్‌నాయుడు, మధునాయుడు పవన్, రాజేష్, ప్రభాకర్‌నాయుడు, రామానాయుడు, పురుషోత్తంనాయుడు, తాతయ్య, శ్రావణ్, పోలయ్యానాయుడు, చలపతినాయుడు, మనోహర్‌నాయుడు, కొన్నలిగురునాధం, ప్రభాకర్, చెంచయ్య మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీ సీనియర్ కార్యకర్తలకు సత్కారం

శ్రీకాళహస్తి, మార్చి 29 ప్రభాతవార్త



ఆది నుంచి తెలుగుదేశంపార్టీలోనే ఉంటూ పార్టీకోసం అహర్నిశలు కష్టపడుతున్న వారికి ఎన్నడూ గుర్తింపు ఉంటుందని బొజ్జలబృందమ్మ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా పార్టీని ముందజలో నడిపిస్తున్న పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌ను బొజ్జలబృందమ్మదుశ్శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అబ్బాబట్లపల్లిలో రామమందిరం కుంభాభిషేకం

శ్రీకాళహస్తి రూరల్,మార్చి 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం అబ్బాబట్ల పల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీరామమందిర కుంభాభిషేకం మహోత్సవ కార్యక్రమాలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.దళితవాడలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయ కుంభాభిషేకం కన్నుల పండువగా సాగింది,ఈ కార్యక్రమాల్లో బియ్యపు మధుసూధనరెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి హాజరయ్యారు. ఈస ందర్భంగా భక్తులకు అన్నదానం జరిపారు. ఈ కార్యక్రమాల్లో పవిత్రారెడ్డి పాల్గొని పేదలకు అన్నదానం జరిపారు.ఈకార్యక్రమాల్లో రామాపురం సర్పంచ్ బాలిరెడ్డి, భాస్కరయ్య, భతయ్య, మాతయ్య, బాలగురవయ్య, బాలసుబ్రమణ్యం, వెంకటస్వామి సుభాషిణి,గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## టెబుల్ టెన్నిస్ క్రీడాకారులకు బ్యాట్లు

శ్రీకాళహస్తి,మార్చి 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని టెబుల్ టెన్నిస్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన 32 మంది క్రీడాకారులకు బుధవారం బియ్యపు పవిత్రారెడ్డి టేబుల్ టెన్నిస్ బ్యాట్లను అందించారు. పట్టణంలోని బిపి అగ్రహారంలోని ఆర్‌పిబిఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో 7,8,9 తరగతులకుసంబంధించి 32 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమాల్లో ఆర్కాడ్ శంకర్, దేవస్థానం పాలకమండలి సభ్యులుమున్నారాయల్, కాపిరెడ్డి డిల్లిబాబు, మునిరామయ్య, నాగేంద్రబాబురెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్షా సామాగ్రి వితరణ

నాగలాపురం, మార్చి29, ప్రభాతవార్త:

మండలంలోని సదాశివ శంకరాపురం జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థి జశ్వంత్ పరీక్షా సామాగ్రిని వితరణగా అందజేశారు. ఇతను ప్రస్తుతం కాలిఫోర్నియాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. గణిత ఉపాధ్యాయుడు రంజిత్ కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు ప్యాడ్లు, జామెంట్రీ బాక్స్, పెన్నులను పంపిణీ బుధవారం పంపిణీ చేశారు. దీంతో ప్రధానోపాధ్యాయురాలు ఉదయచంద్రిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు జశ్వంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు భూపాల్, రవి, బాబు, శ్రీదేవి లు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలకు నాంది జగన్ - ఎమ్మెల్యే

కేవీబీ పురం, మార్చి 29 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కేవీబీ పురంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం వైఎస్ఆర్ పంపిణీ కార్యక్రమం మండల ఎంపీపీ రాయదుర్గం మునిలక్ష్మినందకుమార్ అధ్యక్షతన సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. మండలంలో మొత్తం 809 సంఘాలకు 63,300,72 లక్షల రూపాయలు చెక్కను ఎమ్మెల్యే మహిళలకు అందించారు. మండలంలో మొత్తం 32 పంచాయతీల్లోని మండల మహిళా సమైక్య సంఘాలకు ఈ నిధులను ఆయన అందించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గవర్ల కృష్ణయ్య, బాబుయాదవ్, ధనంజయరెడ్డి, బీసీ నాయకులు హరిబాబురెడ్డి, ఎంపీటీసీలు, వైస్ఎంపీపీలు, శ్రీనివాసులు, సరస్వతి, మండల మహిళా అధ్యక్షురాలు రమాప్రభ, మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, వైస్ ఎంపీపీలు శ్రీనివాసులు సరస్వతి, పర్వతాల బాలసుబ్రహ్మణ్యం, అధ్యక్షురాలు బుర్ర మాధవిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు రాయపేడు హరిబాబు, వెంకటరత్నం, సింగిల్‌విండో డైరెక్టర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అయ్యప్పరెడ్డి, గిరి, వైసీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

కేవీబీ పురం, మార్చి 29 ప్రభాతవార్త:

తెలుగుదేశం 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల పార్టీ అధ్యక్షుడు రామాంజనేయులునాయుడు కేవీబీపురంలో ఎన్‌టీ రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు, కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గర్భవతులకు, బాలింతలకు చిరుధాన్యాలపై అవగాహన - సీడీపీవో

పుత్తూరురూరల్, మార్చి 29 ప్రభాతవార్త:

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్య తనిఖీలు పొందుతున్న గర్భవతులు, బాలింతలు, వంద మంది తల్లులకు పోషకాహార ప్రాధాన్యత గురించి చిరు ధాన్యాల ఆవశ్యకత గురించి సీడీపీవో పద్మజ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, మెడికల్ ఆఫీసర్ శంకర్, స్థానిక నాయకులు సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశలు, స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

వడమాలపేట, మార్చి 29 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం వడమాలపేటలో ఆ పార్టీ నాయకులు జెండా ఎగురవేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. చిత్తూరు పార్లమెంట్ టీడీపీ మహిళా కార్యదర్శి లక్ష్మీప్రసన్న పుట్టిన రోజు కూడా కావడంతో కేక్ కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌నాయుడు, ధనంజయలునాయుడు, లక్ష్మీప్రసన్న, వెంకటయ్య, హేమావతి, ధనలక్ష్మి, వెంకటేష్, భాస్కర్, మాధవనాయుడు, అంజెయ్య, గురునాథంశెట్టి, శివ, మురళీరెడ్డి, చైతన్య, బత్తేయ్య, పురుషోత్తంనాయుడు, బాలకృష్ణ, రాధాకృష్ణ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులున్నా "ఆసరా" కొనసాగింపు

పదిలో ప్రతిభకు ట్యాబ్‌లు, ల్యాప్ ట్యాప్‌లు,ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

చంద్రగిరి, మార్చి 29 ప్రభాతవార్త:



ఆర్థిక ఇబ్బందులు వున్నప్పటికీ మాటతప్పని మడమ తిప్పని నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి క్రమం తప్పకుండా ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్ఎంఆర్ కళ్యాణ మండపంలో బుధవారం వైఎస్ఆర్ ఆసరా చెక్‌లు పంపిణీ చేశారు. ఈ క్రమంలో జగన్ చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు మూడవ విడత రూ.64.37 కోట్లు మంజూరు చేసిన ఘనత మన ముఖ్యమంత్రిదే అన్నారు. నన్నెంతగానో ఆధరిస్తున్న నియోజకవర్గ ప్రజలకు ఆజన్మాంతం రుణపడి వుంటానన్నారు. నా కుటుంబం, నా నియోజకవర్గ ప్రజలు రెండు కళ్ళు అన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థులు ప్రతి మండలంలో మొదటి 5 స్థానాలలో నిలిచే విద్యార్థులకు 5 ట్యాబ్ అందిచనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండల స్థాయిలో ప్రధమ స్థానంలో నిలిచే విద్యార్థికి ల్యాప్ టాప్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి హేమేంద్రకుమార్ రెడ్డి, జడ్పీటిసి యుగంధర్ రెడ్డి, సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి, ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మాదవరెడ్డి, రాజులగారి సుజాత,మస్తాన్, చంద్రమౌళి రెడ్డి, ఎంపిడిఓ రమేష్‌బాబు, తహశీల్దార్ శిరీషా, ఏపిఓ సరిత, విరూపాక్షి ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 3 నుండి పది పరీక్షలు

చంద్రగిరి, మార్చి 29 ప్రభాతవార్త:

ఏప్రిల్ 3వ తేదీ నుండి 18 వరకు పదవ తరగతి పరీక్షలు జరుగుతాయని ఎంఈఓ శ్రీవరం లలితకుమారి తెలిపారు. పది పరీక్షల వివరాలను బుధవారం ఆమె ఈ మేరకు వెళ్ళడించారు. పది పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించబడతాయన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి కనీసం 45 నిమిషాలకు ముందుగా తప్పనిసరి చేరుకోవాలన్నారు. 9.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోనికి అనుమతించచడుతుందన్నారు.

## ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

రేణిగుంట, మార్చి 29 ప్రభాతవార్త:



రేణిగుంట ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద మండపం, పట్టణ టీడీపీ నేతలు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా టీడీపీ జెండా ఆవిష్కరించి ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, టీడీపీ మాజీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ సీనియర్ నేతలు మునస్వామినాయుడు, పుష్పనాథం, మురళి, కొరియర్ రవి, నగరి మునయ్య, కన్నన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాధముని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

విజయపురం, మార్చి 29 ప్రభాతవార్త :



మండలంలో బుధవారం 41వ టిడిపి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. మండలంలోని ఒరూరు, కోసలనగరంలో టిడిపి జెండా ఎగురవేశారు. మండల టిడిపి అధ్యక్షుడు రమేష్‌రాజు, నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన అడుగజాడల్లో నడవాలని సూచించారు. కేశవపురంలో కేక్ కట్ చేసి కార్యకర్తలు పంచారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రమణ్యంరాజు, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు దశరధరాజు, సుధాకర్‌రాజు, రవిచంద్రారెడ్డి, కపిల్, గుణశేఖర్‌రెడ్డి, మురళి, శివలింగం, దాముద్రాజు, రామచంద్రనాయుడు, ఢిల్లీనాయుడు, నిర్మల, బాలయ్య, జయరాజ్, గాలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగోళ్ల ఆత్మగౌరవానికి టిడిపి ప్రతిరూపం

పుత్తూరు, మార్చి 29 ప్రభాతవార్త :



తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ పుత్తూరు పట్టణ, రూరల్ విభాగాల ఆధ్వర్యంలో స్థానికి అంబేద్కర్ సర్కిల్‌లో టిడిపి జెండా ఎగురవేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగు ప్రజల కోసం, జాతి కోసం దివంగత ఎన్టీరామారావు టిడిపిని స్థాపించారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ పార్టీ అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, డి.రవికుమార్, చిత్తూరు పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, సీనియర్ నాయకులు డి.ఎస్.గణేష్, బాలసుబ్రమణ్యంరాజు పాల్గొన్నారు.

## శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

58 రోజులు రూ.5,28,405/–లు

చంద్రగిరి, మార్చి 29 ప్రభాతవార్త:

చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సత్యసాయి జిల్లా దేవాదాయ శాఖ అధికారి కుప్పిరెడ్డి మల్లికార్జున రెడ్డి పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు వెళ్ళడించారు. సప్తగిరి గ్రామీణ బ్యాంక్, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, ఆలయ పాలక మండలి, సిబ్బంది సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. మొత్తం 58 రోజులు రూ.5,28,405/–లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

## పేదల కోసం ఆవిర్భవించిన పార్టీ టిడిపి

రామచంద్రాపురం, మార్చి 29 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ పేదల కోసమే ఆవిర్భవించినట్లు టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి అన్నారు. బుధవారం రామచంద్రాపురం కూడలిలో టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, భారీ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు జనార్ధన్ చౌదరి, చినబాబు, కోరా హరిప్రసాద్, ఉమాపతి నాయుడు, రావిళ్ళ గిరి, గిరిధర్ రెడ్డి, సురేంద్ర నాయుడు, కొట్టే నరశింహారెడ్డి, ఢిల్లీనాథ్ రెడ్డి, గంటాల జీవరత్నం, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరి నియోజకవర్గ ప్రజలే నాకుటుంబం

ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

రామచంద్రాపురం, మార్చి 29 ప్రభాతవార్త:




చంద్రగిరి నియోజకవర్గ ప్రజలే నా కుటుంబమని ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం ఎంపిడిఓ కార్యాలయం ఆవణలో వైఎస్ ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి క్రమం తప్పకుండా అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలను ఆర్ధికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి మహిళా పక్షపాతి అని కొనియాడారు. నేను సంపాధించిన ఆదాయంలో 75 శాతం నియోజకవర్గ ప్రజలకు ఖర్చు చేస్తానన్నారు. 25 శాతం మాత్రమే కుటుంబానికి కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ఎంపిపి ఏవి బ్రహ్మానంద రెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి, భానుకుమార్ రెడ్డి, సింగిల్ విండో అ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ రఘునాధ రెడ్డి, మాజీ ఎంపిపి దామోదర రెడ్డి, డివిజనల్ కన్వీనర్ వెంకట రెడ్డి, ఎంపిడిఓ మహ్మద్ రఫీ, ఏపియం రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## నూతన కలశ స్థాపన

శ్రీకాళహస్తి,మార్చి 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని బిపి ఆగ్రహారం శ్రీరామనగర్‌కాలనీలో వెలసిన సీతారాముల ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా నూతన కలశ స్థాపన ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్యఅతిధిగా విచ్చేసారు. బుధవారం శ్రీరామనగర్ కాలనీలోని సీతారాముల మందిరంలో నూతనంగా కలశ స్థాపనకార్యక్రమాలు ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిదిగా విచ్చేసిన చైర్మెన్ శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఆలయాలకు కొదవ లేదన్నారు.అంతేకాక సీతారాముల మందిరాలు వీధికి ఒకటి రెండు ఉన్నాయని వివరించారు. మందిరం నిర్వాహకులు చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులును సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో రఘువర సుందర మందిర కమిటి సభ్యులు వయ్యాల కృష్ణారెడ్డి, మురళి, వేలాయుధం శ్రీనివాసులురెడ్డి,నడవాటి శరవణ నందం విజయకుమార్, భక్తవత్సలం, సుబ్బులు, ఉభయ కర్తలు ముద్దవెంకటరెడ్డిబాబు,సౌజన్యరెడ్డిబాబు, ఉమాదేవి, చింతపల్లి రాజశేఖర్,శర్మ,ప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సంక్షేమానికి జగనన్న పెద్దపీట...వచ్చే ఎన్నికలలో జగనన్న ఆశీర్వదించాలి

-విద్యార్థులకు ఉచిత పరీక్షా సామాగ్రిని అందజేస్తాం -ప్రతి మండలానికి ఓపెన్ జిమ్ ఏర్పాటు

-వైయస్సార్ ఆసరా చెక్కుల పంపిణిలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతిరూరల్, మార్చి29 ప్రభాతవార్త:



రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని, వచ్చే సార్వత్రిక ఎన్నికలలో జగనన్న ఆశీర్వదించి, అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఎస్వీ యూనివర్శిటీ ఆడిటోరియంలో వైయస్సార్ ఆసరా చెక్కులను మహిళ సంఘాలకు అందజేసారు. అంతకమునుపు ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిశేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళ సంఘాలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని తెలిపారు. జగనన్న మహిలలు ఆర్థికంగా ఆదుకొంటూ వారి ఎదుగుదలకు తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో పరీక్షలు వ్రాస్తున్న 2500 మంది విద్యార్థులకు ఉచితంగా పరీక్షా సామాగ్రిని అందజేస్తామని తెలిపారు. ప్రతి మండలంలో ఒక ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో పాటు మహిళల కోసం ప్రత్యేక జిమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 10 చదువుతున్న, విద్యార్థులు పబ్లిక్ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ట్యాబ్‌లు, మండలానికి ల్యాబ్‌ట్యాప్ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, జడ్పిటిసి రత్నమ్మ, ఉప మండలాధ్యక్షులు విదుదల మాదవరెడ్డి, యశోద, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## తుమ్మలగుంటలో టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవం

-బిరుదాల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, టిడిపి జెండా ఆవిష్కరణ

తిరుపతిరూరల్, మార్చి29 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం తుమ్మలగుంటలో ఘనంగా నిర్వహించారు. తుమ్మలగుంట టిడిపి అధ్యక్షుడు బిరుదాల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి టిడిపి శ్రేణులకు పంచిపెట్టారు. టిడిపి చంద్రగిరి ఇన్‌చార్జి పులివర్తి నాని, తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వర‌రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు కె.శ్రీనివాసులు, బి.సిద్దారెడ్డి, బి.చెంచుశేఖర్, బాలాజీ, నవీన్, వంశీ, శేఖర్, చెంచయ్య, అంకమ్మ, రాజేశ్వరి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇన్సూరెన్స్ సొమ్ము తమ ఖాతాలకు జయచేయాలి

-ఏపిఆర్ఎస్ ఎండియు ఆపరేటర్ల యూనియన్ డిమాండ్

తిరుపతి ప్రెస్‌క్లబ్,మార్చి 29 ప్రభాతవార్త:



ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థలో భాగంగా గత జనవరి, ఫిబ్రవరి నెలల్లో మొబైల్ డిస్పెన్సివ్ యూనిట్(ఎండియు) ఆపరేటర్ల యొక్క బ్యాంక్ ఆఫ్ బరోడాలో వ్యక్తిగత ఖాతాల నుండి 18 వేల 900 నుండి 27 వేల రూ॥ల వరకు సొమ్మును ఇన్సూరెన్స్ నిమిత్తం బ్యాంక్ వారు కట్ చేయడం జరిగింది.దీనిని తిరిగి తమ ఖాతాలకు జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాఖ్య ఎండియు ఆపరేటర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కుడిచేటి కిషోర్‌కుమార్ డిమాండ్ చేశారు.బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇన్సూరెన్స్ సొమ్మును సివిల్ సప్లై కార్పొరేషన్ ద్వారా చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పినా,ప్రభుత్వం మాటలు ధిక్కరించి ఈరోజు తమ ఖాతాల నుండి 5 వేల నుండి 30 వేల వరకు బ్యాంకు వారు అన్యాయంగా కట్ చేయడం దుర్మార్గమన్నారు. గత 6 నెలలుగా ఐసిడిఎస్,ఎండిఎంకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కమిషన్‌ను తక్షణం విడుదల చేయాలన్నారు. సమావేశంలో ఎండియు ఆపరేటర్ల యూనియన్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు వేణు,సోమనాథం,చిన్నారెడ్డి,దయాకర్,దేవా,తనీష్,నాగరాజు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్‌చే పది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

తిరుపతి ప్రెస్‌క్లబ్,మార్చి 29 ప్రభాతవార్త:



బుధవారం స్థానిక శివజ్యోతినగర్‌లోని తంబువానిగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 100 మంది విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్కాట్ కృష్ణప్రసాద్,వి.జగన్నాధంల ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రి అయిన జామెట్రీ బాక్సులు,పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు,నోట్ బుక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీ నుండి పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో తాము ఈ చిరు సాయం చేయడం జరిగిందన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వారు తమ పాఠశాలను గుర్తించి,పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు బెల్లంకొండ సురేష్,బాసి కార్ల రఘు,రామారావు,స్కూల్‌చైర్మన్ కదిరి రాజేంద్ర,రఘునాధ్,మరియు పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

నింద్ర,మార్చి 29 ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడకలు మండల కేంద్రంలో కార్యకర్తలు,అబిమానులు, నాయకులు మధ్య బుదవారం ఘనంగా జరిగింది.ఈసందర్భంగా జిల్లా టిడిపి సినియర్ నాయకులు బాబుయాదవ్ మాట్లాడుతూ దివంగతనేత నందమూరి తారక రామారావు పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి యస్‌సి,యస్‌టి,మైనార్టీల వారు అబివృద్ధి కోసం ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. కార్యాక్రమంలో మనోజ్,కోటీశ్వరరావు,పరదేశి, సుబ్బరావు,పేరమాళ్ళరెడ్డి, రమేష్,జగన్,ప్రశాంత్, ఏబు,రాము తదితరులు పాల్గొన్నారు.

## ఆవిర్భావ సభలో తిరుపతి నాయకులు

తిరుపతి,మార్చి 29ప్రభాతవార్త:



తెలుగుదేశంపార్టీ 41వ ఆవిర్భావ సభ బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సభకు తిరుపతి నుంచి ఇన్‌ఛార్జి సుగుణమ్మ, కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ, రాష్ట్రకమిటీ నాయకులు వి.పుష్పావతి యాదవ్, బిఎల్ కీర్తి, జయరాంరెడ్డి, మునిశేఖర్‌రాయల్, దినకర్, తిరుమలకేశవులు, కరాటే చంద్ర పాల్గొన్నారు. చంద్రబాబును కలసి అభినందనలు తెలిపారు.

## పార్టీసమన్వయకర్త కంభంపాటికి శ్రీవారి ప్రసాదాలు

తిరుపతి, మార్చి 29ప్రభాతవార్త:



తెలుగుదేశంపార్టీ ఆవిర్భావదినోత్సవాన హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సమన్వయకర్త కంభంపాటి రామ్మోహన్‌రావును టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి ముని కృష్ణ కలిశారు.శ్రీవారి తీర్థప్రసాదాలు అందజే శారు.

## ఏప్రిల్ 1న తిరుపతిలో జీతెలుగుడ్రామా జూనియర్స్‌అడిషన్స్

తిరుపతి,మార్చి 29ప్రభాతవార్త:




ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ముందుండే జీతెలుగు ఇప్పుడు "డ్రామా జూనియర్స్"సరికొత్త సీజన్‌లో జనం ముందుకు వస్తోంది. తెలుగురాష్ట్రాల్లోని పిల్లల్లోని నటనా ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో డ్రామా జూనియర్స్ సీజన్ 6తిరుపతిలో ప్రారంభిస్తోంది. తెలుగుప్రేక్షకులను అలరించేందుకు సిద్దమవుతోంది. ప్రతిభగల గాయనీగాయకులను అడిషన్స్‌కు ఆహ్వానిస్తోందని ,3-13ఏళ్ళలోపు పిల్లలకు సువర్ణవకాశమని తెలిపారు. గాయకులుగా మారాలనే కలలగనే పిల్లలకు అద్భుత అవకాశాన్ని జీ తెలుగుఅందిస్తోంది. ఏప్రిల్ 1వతేదీ హోటల్ పిఎల్ఆర్ గ్రాండ్ ,ఆర్టీసి బస్టాండు సమీపంలో తిరుపతిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అడ్మిషన్లు జరుగుతాయి. మరిన్ని వివరాలకు 9154984009 నంబర్‌కు కాల్‌చేసి తెలుసుకోవచ్చన్నారు.

## సీఎం జగన్మోహన్‌రెడ్డి జీవితం ప్రజాసేవకే అంకితం

– మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటరత్నంరెడ్డి

నగరి, మార్చి 29 ప్రభాతవార్త:



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జీవితం ప్రజాసేవకే అంకితమని మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటరత్నంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరి మున్సిపాలిటీ 1వ వార్డులో శ్రీకృష్ణ మహిళా సమాఖ్యలోని 19 గ్రూపుల డ్వాక్రా సంఘం సభ్యులకు స్థానిక కొండచుట్టు మండపం ఆవరణలో వైఎస్ఆర్ ఆసరా అవగాహన సమావేశం ఆర్‌పీ జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో టీఎంసీ సునీత, సీవో లావణ్య, మహిళా సంఘ గ్రూపుల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

## వైభవంగా మహా రుద్రాభిషేకం

వడమాలపేట, మార్చి 29 ప్రభాతవార్త:



స్థానిక భవానీ శంకర దేవాలయంలో మహాశివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా బుధవారం మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం మహాలింగానికి వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించారు. రుద్ర గమకాలు పట్టిస్తూ భక్తుల శివనామ స్మరణల నడుమ మహారుద్రాభిషేకం నిర్వహించారు. పురోహితులు శివ, సాయిల ఆధ్వర్యంలో మహాశివుని లింగాన్ని పూలమాలలతో అలంకరించి మంగళ హారతులు ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కల్లూరుకు చెందిన సుధాకర్‌రెడ్డి, ప్రమీల దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.

